



# కరపత్రం

SINCE 2014

బుధవారం జూన్ 18 2025 సంపుటి :0 సంచిక :243 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## యోగా దినోత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొనాలి

- ప్రతి పంచాయతీ వీలైనంత ఎక్కువ మందిని భాగస్వామ్యం చేయాలి
- యోగా మన సాంస్కృతిక వారసత్వంలో అంతర్భాగం
- యోగా వల్ల ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచుకోవచ్చు
- ప్రధాన మంత్రి నరేంద్ర మోడి పిలుపు.. దేశ ప్రజలకు లేఖ విడుదల



ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ప్రజలందరూ మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రజలందరూ యోగా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన లేఖను విడుదల చేసి ఈ సంవత్సరం జూన్ 21న మనం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోనున్నామని తెలిపారు. ఈ చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. గత దశాబ్ద కాలంగా దేశ ప్రజలు ఈ గొప్ప కార్యక్రమానికి అందిస్తున్న ఆదరణ ఒక ప్రత్యేకమన్నారు. గత పదేళ్లుగా యోగా కేవలం భారత దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావాన్ని చూపడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ ఏడాది జూన్ 21న విశాఖపట్నం కేంద్రంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని "యోగా.. ఒక భూమి, ఒక ఆరోగ్యం" అనే థీమ్ తో ముందుకు వెళ్తున్నామన్నారు.




## గో సంరక్షణకు ఎంత ఖర్చయినా ప్రభుత్వం వెనుకాడదు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్:
రాష్ట్రంలో సమగ్ర గోసంరక్షణ విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీనికోసం వివిధ రాష్ట్రాల్లో విధానాలను అధ్యయనం చేసేందుకు ముగ్గురు అధికారులతో కమిటీ నియమించారు. పశు సంవర్ధకశాఖ ప్రత్యేక సీఎస్ సవ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీని గోసంరక్షణపై లోతుగా అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో గో సంరక్షణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోసంరక్షణే లక్ష్యంగా పాలసీ తయారు చేయాలని సీఎం అన్నారు.తగిన స్థలం లేకపోవడం వంటి సమస్యలతో గోవులు తరచూ మృత్యువాత పడుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి విడతలో రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సూచించారు. వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు విశ్వవిద్యాలయం సమీపంలో విశాలమైన గోశాలలు నిర్మించాలని సీఎం తెలిపారు. భక్తులు సమర్పించే కోడెల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వేములవాడ సమీపంలో కనీసం వంద ఎకరాల్లో గోశాల ఉండాలని సీఎం తెలిపారు. గో సంరక్షణ కోసం ఎంత ఖర్చయినా ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సీఎంకు అందజేశారు. సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి




» ఆపరేషన్‌లో ఆదివాసీలే హతమవుతున్నారు » ఇది ప్రాజస్వామ్య సూత్రాలకు విరుద్ధం » మావోలతో వెంటనే శాంతి చర్చలు జరపాలి » ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాలో మేధావుల పిలుపు

హైదరాబాద్,జూన్ 17 :
ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు.

2లో..

## బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ప్రకటన



హైదరాబాద్:
గత కొంతకాలంగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించిన ఆ పార్టీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.. తాజాగా సంచలన ప్రకటనతో మరొకసారి వార్తల్లోకి వచ్చారు. ఇక ఐక్యంగా కలిసి పని చేద్దామంటూ రాజాసింగ్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం(జూన్ 17) రాజాసింగ్ ఓ స్టేట్‌మెంట్ రిలీజ్ చేశారు.'పార్టీలో ఐక్యత, పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేస్తున్నాను. కానీ నన్ను టార్గెట్ చేసి అడ్డంకులు సృష్టించాలని చూసినా నిస్వార్థంగా పార్టీ కోసమే పని చేశా. ఒక పార్టీ కార్యకర్తనైన నన్ను ఇబ్బంది పెడితే ఏం లాభం?. కిషన్‌రెడ్డి వ్యక్తిగత సమయం ఇస్తే వచ్చి కలుస్తాను. సమస్యలు, పార్టీలో మా స్పష్టతను వివరిస్తాను. సమయం నిర్ణయించే చెబితే వచ్చి కలిసేందుకు సిద్ధంగా ఉన్నా. విభజించడానికి కాదు.. ఐక్యత కోసం ఇక్కడ ఉన్నా. వ్యక్తిగత విభేధాలను విడిచిపెట్టి ఐక్యంగా పని చేద్దాం' అని రాజాసింగ్ తన ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.

## మూడెకరాల రైతులకు తొలుత రైతుభరోసా

- 1,551.89 కోట్ల రూపాయలను విడుదల చేశాం: తుమ్మల



ఖమ్మం,జూన్ 17:
తెలంగాణ రాష్ట్రంలో మూడు ఎకరాల వరకు భూమి ఉన్న అన్నదాతలకు రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేసింది. మంగళవారం 1,551.89 కోట్ల రూపాయలను విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ రోజు 3 ఎకరాల వరకు భూమిని కలిగి ఉన్న రైతులందరి ఖాతాలలోకి ఎకరానికి 6 వేల చొప్పున రైతు భరోసా నిధుల జమ చేయడం జరిగిందని వెల్లడించారు. అయితే, అందుకోసం 1551.89 కోట్ల రూపాయలను విడుదల చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 10.45 లక్షల మంది రైతులకు సంబంధించిన 25.86 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు జమ చేశాం అన్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారందరికి రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటించారు.



2లో

## త్వరలో రూ.1,800కోట్లతో ఉపాధి హామీ పనులు: మంత్రి సీతక్క

హైదరాబాద్:
తెలంగాణ వ్యాప్తంగా త్వరలో ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామాణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఉపాధి హామీ కింద రూ. 1,800కోట్ల పనులు మంజూరు చేశామని, ఈ సారి అంగన్వాడీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. తన శాఖలో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, ఇతర పెండింగ్ అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

## బిఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్‌తోనే కాంగ్రెస్ ఓటమి

» వందలాది కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్
» బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
» ఈ వ్యవహారంలో కెటిఆర్ సిగ్గుతో తలదించుకోవాలి
» జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చిన మహేశ్ కుమార్



హైదరాబాద్,జూన్ 17:
ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ సిగ్గుతో తలదించుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆనాడు అధికారంలో ఉన్న కెసిఆర్, కెటిఆర్‌లు వేలాదిమంది కాంగ్రెస్ నేతల ఫోన్లు టాప్ చేశారని అన్నారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం టీపీసీచీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణమన్నారు. ఎలాంటి అధికార హోదా లేని వ్యక్తికి అధికారాన్ని కట్టబట్టి తమ ఫోన్‌లను టాప్ చేయించారని ఆరోపించారు. నక్సలైట్ల సానుభూతిపరుల పేరుతో తమ ఫోన్లు టాప్ జరిగాయన్నారు.

# హెడ్ క్వార్టర్ గా రామగిరి రత్నాపూర్ సబ్ స్టేషన్



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

రామగిరి మండలం రత్నాపూర్ 33/11 కెవి సబ్ స్టేషన్ మండల హెడ్ క్వార్టర్ గా చేస్తూ ఎన్ పిడిసిఎల్ సిఅండ్ఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రత్నాపూర్ గ్రామంలో సింగరేణి యాజమాన్యం సహకారంతో రూ.4.50 కోట్లతో ఈ సబ్ స్టేషన్ నిర్మాణం జరిగింది. కాగా బేగంపేట లో సబ్ స్టేషన్ ఉండగా ఉండేది. దీనిని ఇక్కడి నుండే విద్యుత్ ఆపరేషన్ పనులు జరుగుతుండేవి. ఈ క్రమంలో రత్నాపూర్ లో నూతన సబ్ స్టేషన్ నిర్మాణం జరిగింది. దీనితో వినియోగదారుల, ప్రజల సౌకర్యార్థం రామగిరి రత్నాపూర్ సబ్ స్టేషన్ లో ఏఈ తో పాటు ఆపరేషన్స్ అన్ని పనులు ఇక్కడి నుంచే జరుగాలని ఎస్ఈ మాధవరావు, మంథని డిఈ వెగ్గలం ప్రభాకర్ లు తెలిపారు. వినియోగదారులందరు తమ సేవలు స్థానికంగా వినియోగించుకోవాలని ఏఈ కోరండ్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

# రాష్ట్ర అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్న బిఆర్ఎస్

ఇంత పెద్ద మొత్తంలో రైతుల కోసం ఖర్చుపెట్టిన ప్రభుత్వం దేశంలో ఏక్కడ లేదు.. రూ. 500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నాం.. రాష్ట్రంలో పారిశ్రామికంగా, సంక్షేమ పరంగా, వ్యవసాయ లాంటి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. రూ. 38 వేల కోట్ల నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష కోట్లకు పెంచి.. అందిన కాడికి దోచుకున్నారు.. ఆ ప్రాజెక్టు ఇప్పుడు పనికి రాకుండా పోయింది అని భట్టి పేర్కొన్నారు. సమస్యలు ఉన్నవారు రాజధాని వరకు రాలేరని, ప్రజల సమస్యలను స్థానికంగా పరిష్కరించే వాళ్లు ఉండటం గొప్ప విషయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు ఉండదని గత పాలకులు దుష్ప్రచారం చేశారు. ఈ ఏడాది మార్చిలో గరిష్ఠంగా 17,162 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఎంత డిమాండ్ ఉన్నప్పటికీ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశాం అన్నారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు. 29 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.సాగుకు ఉచిత విద్యుత్ కోసం రూ.11,500 కోట్లు కేటాయించాం. పేదల ఇళ్లకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. గృహజ్యోతి, ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ కోసం ఏటా రూ.13వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాం. 1 కోటి 49లక్షల 35వేల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా వేస్తున్నాం'అని భట్టి తెలిపారు.

భూపాలపల్లిలో పలు అభివృద్ధి కార్యాక్రమాల్లో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. జిల్లాలోని గోరికొత్త పల్లి మండలం చెన్నాపూర్ లో కోటి 40 లక్షలతో సబ్ స్టేషన్ ప్రారంభం చేసుకున్నామన్నారు. విద్యుత్ కు అంతరాయం కలగకుండా రూ.8 కోట్ల వ్యయంతో 33/11 కేవీతో మంజూరు నగర్, ధర్మారావు పేట, నవాబుపేటలలో విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడించారు. అలాగే, దీర్ఘకాలికంగా సమస్య లేకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ ఉండదన్నారు, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంతరాయం కలగకుండా 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. 6 హామీలలో భాగంగా రాష్ట్రంలో 50 లక్షల మందికి 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని తెల్పి చెప్పారు. జిల్లాలో 47 వేల కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్ ఇస్తున్నాం.. 46 వేల వ్యవసాయ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లకు ఉచిత కరెంటు ఇస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇక, సౌర శక్తి ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మహిళా సంఘాలకు ఇవ్వడానికి సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి ప్రణాళికలు రచిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పాఠశాలకు ఉచిత కరెంట్ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నాం.. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బంది ఉన్నప్పటికీ, 7 లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో తీసుకెళ్తున్నామన్నారు. బీఆర్ఎస్ వాళ్ళు ఉచిత బస్ ప్రయాణం ఎందుకు ఇస్తున్నారు అని విమర్శిస్తున్నారు.. ఎందుకు ఇస్తున్నామో మహిళలను అడగండి అని సూచించారు. ఇక, గోదావరి నదీ జలాల కొరకు మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం ప్రాజెక్టులను నిర్మించామని గొప్పలు చెప్పే వాళ్ళు ఈ ప్రాంతానికి ఒక చుక్క నీరు ఇవ్వకుండా తరలించుకెళ్లారని మండిపడ్డారు. గోదావరి నది జలాలకు సంబంధించి ఎగువన ఉన్న మహారాష్ట్ర, దిగువన ఉన్న ఆంధ్ర వాళ్ళు తెలంగాణ రాష్టానికి నీరు ఇచ్చిన తర్వాతే మీరు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ముందు మా రాష్ట్రానికి నీరు ఇచ్చిన తర్వాతే పక్కా రాష్ట్రాలకు నీటిని తరలించాలని అప్పుడే చెప్పామని శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. అలాగే, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత సన్న బియ్యం ఇస్తామని చెప్పాం.. ఇస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం.. కొంచం సమయం పట్టొచ్చు కానీ చేసి చూపిస్తాం.. ఇక, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతాం.. అభివృద్ధి చేసి చూపిస్తామని వెల్లడించారు. కొత్త జిల్లాలో కొత్త మండలాలకు విద్యుత్ ఏఈ కార్యాలయాలు మంజూరు చేశారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి నా కృతజ్ఞతలు.. దీంతో పాటు ఇల్లు లేని నిరుపేదలకే ఇవ్వాలని కలెక్టర్ లకు చెప్పాం.. ఇందిరమ్మ ఇండ్లు ఎక్కువగా అవసరం ఉన్న కూడా కలెక్టర్ చూసి కేటాయిస్తుంది.. వచ్చే విడతలో తప్పకుండా ఇల్లు లేని పేదల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చెప్పారు.

# రాజన్న దేవాలయం నుండి బ్రిడ్జి వరకు మూడో రోజు కొనసాగుతున్న రోడ్ల విస్తరణ పనులు



**- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు**

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి వేములవాడ జూన్ 17**

తెలంగాణలోని దక్షిణకాశీగా పేరు గాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వెళ్లే రోడ్డు వెడల్పు పనులు గత మూడు రోజుల నుండి ప్రారంభించారు. నిర్వాసితులందరికీ నష్ట పరిహారం చెల్లించి పనులు ముమ్మారంగా కొనసాగు తున్నాయి. వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్న విస్తరణ పనులు. రాజన్న ఆలయ పరిసరాలలో కొనసాగుతున్న 144 సెక్షన్.ఇప్పటికే 100 మందికి పైగా పరిహారం చెక్కులు తీసుకున్న బాధితులు. విద్యుత్ సరఫరా నిలిపివేసి నిర్మాణాలు తొలగిస్తున్న సిబ్బంది. భారీ బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీస్ అధికారులు.

# ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

మొదటి పేజీ తరువాయి

ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని భారాస నేత దాసోజు శ్రావణ్ విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే.. ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమనమేనని శాశ్వత పరిష్కారం కాదన్నారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి లోబడి ఉందన్నారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా .. నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని నటుడు ఆర్ నారాయణ మూర్తి ఫైర్ అయ్యారు పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు.హైదరాబాద్ ధర్నా చౌక్ లో శాంతి చర్చల కమిటీ మహా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... అణిచివేయాల్సింది మావోయిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యమని అన్నారు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ . ఇది యుద్ధ సమయం కాదు.. చర్చలతోనే పరిష్కరించుకోవాలని మాస్కో సైప్రస్ లో అన్న మోదీ మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగుతుందన్నారు. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. మావోయిస్టులైన భారత పౌరులను చంపుతున్న మోదీ,అమిత్ షా... వీళ్లేం హిందువలని ప్రశ్నించారు. ఇదేనా రామ రాజ్యం అంటే? ఆపరేషన్ కగార్ ను తక్షణమే ఆపేసి శాంతి చర్చలు జరపాలని అన్నారు. కార్పొరేట్ సంస్థల కోసమే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు ప్రొఫెసర్ హరగోపాల్. శాంతి చర్చలే అభివృద్ధికి మార్గం అవుతుందన్నారు. హై సందర్భంగా మాట్లాడిన ఆయన చర్చలతో మావోయిస్టుల సమస్యకు పరిష్కారమని అన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే ఆపడం లేదని విమర్శించారు. చర్చలతోనే మావోయిస్టు సమస్య పరిష్కారమని హరగోపాల్ అన్నారు..

# రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్ పై కేసులు

**- మాజీ ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్**

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి గోదావరిఖని జూన్ 17:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను, చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న కేటీఆర్ పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, రేవంత్ రెడ్డి తన 18 నెలల పాలనలో కేటీఆర్ పై 14 కేసులు పెట్టారని మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. రేవంత్ రెడ్డి కుట్రలో భాగంగా ఏసీబీ కార్యాలయానికి విచారణకు తెలంగాణ భవన్ నుంచి వెళ్తున్నా సందర్భంగా కేటీఆర్ ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కలిసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, 420 హామీల ఊసే లేదన్నారు. ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. కేటి రామన్న కడిగిన ముత్యంలా బయటికి రావాలని అంజనేయ స్వామి నీ వేడుకుని వారికి అంజనేయ స్వామి దీవెనలు ఉంటాయని మా వానరా సైన్యం తోడుగా ఉంటుందని రామన్న తెలిపామని చెప్పారు. ఈ కార్యక్రమం మాజీ పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ తో పాటు నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్‌తోనే కాంగ్రెస్ ఓటమి

మొదటి పేజీ తరువాయి

ఈనాడు కేటీఆర్ తాము నీతివంతులం, నిజాయితీపరులమని అంటున్నారని.. ఆయన సిగ్గుతో తలవంచుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గపు చర్య అని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకుల ఫోన్ల ట్యాపింగ్ జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వందలాది మంది నాయకుల ఫోన్లను చట్టానికి వ్యతిరేకంగా ట్యాప్ చేశారని మండిపడ్డారు. రాజకీయ నేతల ఫోన్ల ట్యాపింగ్ చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఆనాటి సీఎం, కేటీఆర్‌లు సిగ్గుతో తలవంచుకోవాలని వ్యాఖ్యలు చేశారు. ఏ రాజకీయ నేత, పార్టీ ఉండకూడదని.. తామే శాశ్వతంగా అధికారంలో ఉండాలనే దుర్బుద్ధితో ఫోన్ ట్యాపింగ్‌కు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మూమెంట్స్ అన్ని కూడా ట్రాక్ చేశారని మండిపడ్డారు. 2022 నుంచి కాంగ్రెస్ నాయకుల ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నారు. 650 మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని తెలిపారు. మ ఫోన్లను ట్యాప్ చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూశారని ఆరోపించారు. నిజాయితీ గల సిట్ అధికారులు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో మరే ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే ఈ కేసులో నిందితులకు శిక్ష పడాల్సిందే అని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవ్వరినీ ఉపేక్షించవద్దన్నారు. విచారణను సజావుగా జరిపి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారికి శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వానికి వినతి చేశారు. దేశ చరిత్రలో ఇంత మంది ఫోన్లు ట్యాప్ చేయడం ఇదే ప్రథమమన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టు ఈ కేసును తీవ్రంగా పరిగణించి నిందితులను శిక్షించాలని కోరారు. ఆనాటి నేతలు వారి అవసరాల కోసం రాజకీయ నాయకులు, జడ్జిలు, విలేకర్లలతో పాటు వారి హయాంలో పని చేసిన అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి అవసరాలకు అనుగుణంగా ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకుందని ఆరోపించారు. 2023 ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి హార్డ్ డిస్కలను ప్రభాకర్ రావు ధ్వంసం చేయించారన్నారు. ప్రభాకర్ రావు, అప్పటి చీఫ్ సెక్రటరీ కలిసి హార్డ్ డిస్కులు ధ్వంసం చేశారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# త్వరలో రూ.1,800కోట్లతో ఉపాధి హామీ పనులు: మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి

ఈ ఏడాది మండలానికి రెండు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 1440 పంచాయతీ కార్యాలయాలు, మరో 1400 అంగన్వాడీ భవనాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు. నెలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని పనులు చేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. ఎంపీడీవోల బదిలీలు, వాహనాల అలవెన్స్‌లకు సంబంధించిన ఫైళ్లకు రెండ్రోజుల్లో క్లియరెన్స్ వస్తుందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో విధానాన్ని అధ్యయనం చేసేందుకు అధికారుల్ని పంపించనున్నట్లు తెలిపారు. భవనాల నిర్మాణాల కోసం 15 రోజుల్లో టెండర్లు వేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, డైరెక్టర్ సృజన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కులగణనపై గళమెత్తిన రాహుల్

## బిసి మంత్రిత్వ శాఖ కోరినా ఇవ్వని మోడీ: విహెచ్

కుల గణనపై ఎవరు మాట్లాడనప్పుడే రాహుల్ గాంధీ మాట్లాడారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు పేర్కొన్నారు. ఎవరు ఎంతో, వారికి అంత అని చెప్పారు.. ఇప్పటి వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని మూడుసార్లు కలిసి బీసీలకి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఇవ్వమని కోరినా ఇవ్వలేదు.. జన గణనతో మాకు వచ్చే లాభం లేదు అని తేల్చి చెప్పారు. కుల గణన చేస్తే మాకు మంచిది.. రాహుల్ గాంధీ అగ్రకులంలో పుట్టినా బీసీలకు న్యాయం చేయాలని మాట్లాడారు.. మోడీ బీసీ అయినా, కుల గణన చేయడానికి ఆలోచిస్తున్నాడు అని ఎద్దేవా చేశారు. జన గణనతోనే కుల గణన చేయాలి అని వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. ఇక, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖతో పాటు కుల గణన చేయాలని వీహెచ్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎంపీలు నోరు విప్పాలి.. లేదంటే, ఎంపీల ఇంటి ముందు ధర్నా చేస్తాను అని హెచ్చరించారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే బీసీలకు న్యాయం చేసింది.. అలాగే, కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టి బీసీలకు రావాల్సిన న్యాయమైన వాటాను అందజేయాలని అన్నారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ వారిచే జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల

**-అంక్సాపూర్ నకు 12 దేశభక్తుల ఫోటోలు బహుకరణ**




**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

ఈరోజు జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల అంక్సాపూర్ జిహెచ్ఎంఆర్ మల్లీశ్వరి అధ్యక్షతన రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ వారి 12 దేశభక్తుల ఫోటోల బహుకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షులు రజనీష్ కిరాడ్ సెక్రెటరీ రాసా ఆనంద్ క్యాషియర్ పి. శశిధర్ మరియు మారుతి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారిని పాఠశాల జిహెచ్ఎం పాఠశాలకు 12 దేశభక్తుల ఫోటోలను అందజేయడంపై అభినందనలు తెలియజేయడం జరిగింది. జిహెచ్ఎం మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఎస్ఎస్సి లో అత్యుత్తమ ఫలితాలు విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. అదేవిధంగా రాబోయే విద్యా సంవత్సరంలో కూడా ఎస్ఎస్సి లో మంచి ఫలితాలను సంపాదిస్తామని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినాలని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు అన్నిట్లో ముందు ఉంటారని అని నైపుణ్యాలు కలిగి ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా మునుమందు పాఠశాలకు అనేక రకాల సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు.

# అసాంఘిక శక్తులైన వి డి సి లను కూకటివేళ్లతో అణిచివేస్తాం

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

- జూలై మొదటి వారంలో నిజామాబాద్ జిల్లాలో వీ డి సి ల ఆగడాలపై సమీక్ష సమావేశం.



భక్కీ వెంకటయ్య (ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్) చట్టం లేని వి డి సిల రద్దుకు అన్ని విధాల కసరత్తుచేస్తాం జిల్లా శంకర్ ( మెంబర్, ఎస్సీ ఎస్టీ కమిషన్)రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ కు వి డి సి ల ఆగడాలపై ఫిర్యాదు చేసిన శ్రీధర్ బట్టు .ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ ని కలిసి నిజామాబాదు జిల్లాలో జరుగుతున్న వి డి సి ల దౌర్జన్యాల గురించి.. వారు చేస్తున్న దాడుల గురించి వివరించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వి డి సి (గ్రామ అభివృద్ధి కమిటీ)ల పేరుతో ఆర్మూర్, బాల్కొండ , నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల లో కుల వృత్తుల పై మరియు ఇతర బలహీన వర్గాల పైన దాడులు మరియు సాంఘిక బహిష్కరణ లు, వెలివేత లు విషయమై మీకు తెలియజేస్తున్నాము.వృత్తి దారు లైన ఎస్సీ ఎస్టీ, గౌడ(గీతా కార్మిక వృత్తి) , గంగపుత్ర(మత్స్యకార వృత్తి), రజక(దోబి), నాయి బ్రహ్మన(మంగళి), యాదవ(గొర్ల కాపరి) , అరె కటిక, ముదిరాజ్ , మాదిగ మరియు ఎస్సీ, ఎస్టీ ఇతర కులల పైన దాష్టీకాలు చేస్తూ వృత్తిదారుల వృత్తి చేసుకున్నందుకు లక్షల రూపాయలు బలవంతంగా వసూలు చేస్తున్నారు .. హుకుమ్ జారి చేస్తున్నారు. ఇవ్వని యెడల వారి పైన ద్వేషాన్ని పెంచుకొని వారిని గ్రామ సాంఘిక బహిష్కరణకు గురి చేస్తున్నారు.. దేశ పౌరుల యొక్క ప్రాథమిక హక్కులను మరియు భారత రాజ్యాంగాన్ని కూని చేస్తున్నారు. గ్రామాల్లో గ్రామ అభివృద్ధి కమిటీలు ( వి డి సి) ల గ్రామ అభివృద్ధి కాకుండా... ఆ కమిటీలో ఉండే సభ్యులు చట్టాన్ని చేతిలోకి తీసుకొని ప్రభుత్వ యంత్రాంగాన్ని భారత న్యాయవ్యవస్థను, కార్య నిర్వాహక శాఖ వ్యవస్థను ధ్వంసం చేసే కుట్ర చేస్తున్నారు. వి డి సి లు ఆధిపత్యం చెలాయించడానికి ఇష్టానుసారంగా కొన్ని చట్టాలతో పాటు వీడీసీ లో ఓ రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకొని భారత రాజ్యాంగాన్ని బేఖాతర్ చేస్తు భారత కార్యనిర్వహక శాఖ ను కాదని "సమాంతర ప్రభుత్వాన్నినడుపుతున్నారు"చదువు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకా.వేరే జీవన ఉపాధి లేక, గ్రామాల్లో జీవిస్తూ తమ తాతముత్తాతల వృత్తి అయిన కులవృత్తి కొనసాగిస్తూ చాలి చాలని జీతాలతో/ ఆదాయంతో బ్రతుకులు వెళ్లదీస్తున్న ఈ అభాగ్యుల జీవితాల పైన దాడులను అరి కట్టాల్సిన అవసరం ఉన్నది.. దేశంలో , తెలంగాణ ప్రాంతంలో, ఎక్కడ లేని విధంగా ఆర్మూర్ డివిజన్ , మెట్ పల్లి డివిజన్ , కామారెడ్డి డివిజన్ , బోధన్ డివిజన్ , నిర్మల్ డివిజన్ ప్రాంతంలో బడుగు బలహీనవర్గాల పైన ఆధిపత్యాన్ని కొనసాగించడానికి పూనుకున్నారు. వీరి పైచచికత్వానికి అద్దు అదుపు లేకుండా పోయింది.. కనీసం వీరిని .. వీరి చేష్టలను ప్రశ్నించి ఎదురించి అడిగే మానవుడే లేకుండా పోయాడు అని తెలుపుటకు అతిశయోక్తి లేదు. వాస్తవానికి ప్రతి గ్రామంలో పుట్టి పెరిగి అభివృద్ధి చెందిన విద్యాధికులైన అన్ని కులాల్లోని, అన్ని వర్గాల్లోనూ, ప్రభుత్వ ఉద్యోగులు , అమెరికా లాంటి విదేశాల్లో నెలకు లక్షలాది రూపాయిలు అర్జిస్తున్న ప్రవాస భారతీయులు వ్యాపారవేత్తలు ఆయా గ్రామాల అభ్రుద్ధికి పాటు పడాల్సిన అవసరం ఉంది .. వారికి జన్మనిచ్చిన గ్రామం యొక్క రుణం తీర్చుకోవాల్సిన అవసరం బాధ్యత ఉన్నది. గ్రామాల్లో 100ల ఎకరాలు భూములు ఉన్న భూస్వాములు పెత్తందారులు, ఉన్నత వర్గాలు గ్రామానికి ఎలాంటి ఆర్థిక సహాయం చేయట్లేదు..కానీ ఆర్థికంగా చితికిపోయి... "రెక్కాడితే గాని డొక్కాడని" పరిస్థితి లో ఉన్న నిత్య శ్రామికులు ,కూలీలను , చిన్న చిన్న వృత్తిదారు లైన గీతా కార్మికులు , మత్స్యకారులు, గొర్ల కాపరులు, అరెకటికెల, నాయి బ్రాహ్మణ , చిన్న చిన్న కూల్డ్రింక్ షాపులు, కిరాణ కొట్టులు పైన గ్రామ అభివృద్ధి పేరు మీద బరువులు మోపి బలవంతంగా వారి కష్టార్జితాన్ని లాక్కుంటున్నారు. హైదరాబాద్ వీడిసి ల దౌర్జన్యాలు వాటి దుష్ప్రభావాల కు వ్యతిరేకంగా బాధితులకు అండగా నిలవాలని వీడిసి ల పై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ని మరియు కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ ను కోరిన బి వి ఎమ్ రాష్ట్ర అధ్యక్షులు, వి డి సి వ్యతిరేక పోరాట కమిటీ శ్రీధర్ బట్టు మరియు డి బి ఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్న, నాయకులు మందాపురం రాకేష్.. తదితర నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం..



**కుత్బుల్లాపూర్, కరపత్రం ప్రతినిధి జూన్ 17:**
నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ బాచుపల్లి పరిధిలోని 18 వ డివిజన్ సాయి అనురాగ్ కాలనీ రోడ్ నెం .7ఏ, రోడ్ నెం .7బి సీసీ రోడ్ మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తిగా పాడువటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని గత నెల సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి. మున్సిపల్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్ మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి 35,00,000 రూ మంజూరు చేయించి ఈరోజు సీసీ రోడ్ మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ను ప్రారంభించిన నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అనంతరం కాలనీ వాసులు శాల్వాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతు కాలనీ కొరకు మరి కొన్ని మౌలిక సదుపాలయ కొరకు హన్మంతన్నకు వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డి, యన్ఎంసీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కోలన్ జీవన్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి సెక్రటరీ కోలన్ బాల్ రెడ్డి, డివిజన్ రాజేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు షబీర్, శ్రీనివాస్, కావ్య, శ్రీకాంత్, శ్రీధర్ గౌడ్, జితేందర్ రెడ్డి, రాజ్ కుమార్, హనుమంత్, నవీన్ కుమార్, జిత్తు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంపీ రఘురాం రెడ్డి ఔదార్యంతో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు...

- క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణ కుమారి, కాంగ్రెస్ జిల్లా నేత కొప్పుల చంద్రశేఖర్
- పాల్గొన్న ఐఎన్ టీయూసీ బాధ్యులు
- వివిధ అడ్డాల నుంచి అధిక సంఖ్యలో హాజరైన ఆటో డ్రైవర్లు





**ఖమ్మం, కరపత్రం ప్రతినిధి జూన్ 17:**
పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఔదార్యం చూపి ఆటో డ్రైవర్ల కోసం ఖాకీ చొక్కాలను సిద్ధం చేయించారు. నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల క్యాంపు కార్యాలయంలో మంగళవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ వివిధ అడ్డాల నుంచి తరలివచ్చిన ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా.. మద్దినేని స్వర్ణకుమారి మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆటో డ్రైవర్లకు.. యూనిఫామ్ చొక్కాలను ఎంపీ సమకూర్చడం..ఎంతో సంతోషకరమని అన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కార్మికులందరికీ ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో...ఐ ఎన్ టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్. విప్లవ్ కుమార్, కార్పొరేటర్ దొడ్డా నగేష్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, నాయకులు పరికిపల్లి శ్రీను, ఆటో వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, సంఘం బాధ్యులు సిద్దల నగేష్, తోట సైదులు, కే. మధు, ఏ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే రైతుల సమస్యలు పరిష్కరించాలి....



**కూసుమంచి, కరపత్రం ప్రతినిధి జూన్ 17:**
అనేక మంది రైతులకు ఇప్పటికి పట్టాదారు పాసు పుస్తకాలు లేక ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పరిష్కరించి తగిన న్యాయం చేయాలని బీజేపీ మండల కార్యదర్శి కోరుట్ల వీరన్న కోరారు.మంగళవారం గైగోళ్లపల్లి గ్రామంలో జరిగిన భూభారతి సభలో ఆయన అధికారులతో మాట్లాడుతూ... పాసు పుస్తకాలు లేకపోవడం మూలంగా రైతు బంధు పథకం డబ్బులు గత ప్రభుత్వం హయాంలో పొందలేకపోయారని, ప్రస్తుతం రైతు భరోసా ను కూడా నష్ట పోతున్నారని, అదే విధంగా ప్రధాన మంత్రి సమ్మాన్ యోజన (మోడీ) పథకం కూడా వర్తించటం లేదని ఆవేదన చెందారు. పైగా సన్న, చిన్నకారు రైతులే పెద్ద మొత్తంలో ఉన్నారని తెలిపారు. ఈ విషయంలో మండల వ్యవసాయం, రెవిన్యూ అధికారులు దరఖాస్తులకే పరిమితం కాకుండా ప్రతీ దరఖాస్తును పరిశీలించి రైతులను ఆదుకోవాలని విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకూ పరిమితం కాకుండా తమ చిత్తశుద్ధిని నిరూపించుకొని రైతులకు నిజమైన భరోసా కల్పించాలని సూచించారు. లేని యడల గత ప్రభుత్వంకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో..... బిజెపి కార్యదర్శి కోరుట్ల వీరన్న, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# "యోగా" ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలనేదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం

- శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు. శంకర్



**శ్రీకాకుళం,కరపత్రం ప్రతినిధి జూన్ 17:**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న 'యోగాంధ్ర' కార్యక్రమంపై గొండు శంకర్ స్థానిక విశాఖకోలనీ పార్టీ కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా అధికారులు, టీడీపీ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి అధికార బృందాలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని, యోగాను భావితరాలకు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా డేలో పాల్గొంటారని, విశాఖలో పర్యటించిన సీఎం చంద్రబాబు యోగాంధ్ర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి, ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష చేశారన్నారు. ఈ వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొంటున్నారని, మన నియోజకవర్గాల నుండి జనసమీకరణ ఏర్పాట్లు పై స్పష్టత కోసం కార్యక్రమం జరిగిందన్నారు. అనంతరం యోగాంధ్ర వేడుకలలో భాగముగా విచ్చేసిన కృష్ణ జిల్లా, పామూరు నియోజకవర్గ నాయకులు వర్ల. కుమార్ రాజా, శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాకుళం ప్రజలందరి అభిమానం సొంతం చేసుకొని, అందరివాడుగా, అందరి మన్ననలు పొందుతున్న శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు. శంకర్ కు ప్రత్యేక అభినందనాలన్నారు. దేశ ప్రధాని పిలుపుమేరకు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా. చంద్రబాబునాయుడు యోగాంధ్ర విజయోత్సవాలను, విజయవంతం చెయ్యటానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా మనమంతా కలసి, శ్రీకాకుళం నియోజకవర్గం నుండి అధిక జన సమీకరణతో పాల్గొని యోగాంధ్రాను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండలస్థాయి, గ్రామస్థాయి టీడీపీ అధికార బృందం, కార్యకర్తలు, అభిమానులు, డివిజన్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో ట్రాఫిక్ సమస్యలు పట్ల ఆటో డ్రైవరు జాగ్రత్త వహించాలి .

- పర్మినెంట్ ఆటో అడ్డాలు ఏర్పాటు చేయాలి




**ఖమ్మం,కరపత్రం ప్రతినిధి జూన్ 17:**
ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు పేర బోయిన మోహన్ రావు అధ్యక్షతన ఆటో యూనియన్ జిల్లా జేఏసీ సమావేశం జరిగింది . ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం ఖమ్మం నగరంలో ట్రాఫిక్ సమస్యల గురించి నిన్న ట్రాఫిక్ ఏసిపి , సిఐ , ఎస్ఐ లతో ఆటో యూనియన్ నాయకులు మరియు ఆటో డ్రైవర్ల తో సమావేశం ఏర్పాటు చేశారు . ఈ సమావేశంలో అధికారులు కొన్ని ప్రాంతాల్లో కొన్ని ఆటోలు మాత్రమే పెట్టాలని సూచించడం జరిగింది . అలాగే ఆటో కాగితాలు ఉండాలని ట్రాఫిక్ ను అక్కడ ఉన్న ఆటో అడ్డా డ్రైవర్లే చూడాలని అన్నారు . ఈ సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ మరికొన్ని చోట్ల ఆటో స్టాండ్లు ఇవ్వాలని , అలాగే పర్మినెంట్ ఆటో అడ్డాలు ఏర్పాటు చేయాలని , ఆటో కాయితాలకు కొద్ది రోజులు సమయం ఇవ్వాలని ఆటో యూనియన్ చేసి ఎస్ హెచ్ ఓ కి తెలియజేయాలని నిర్ణయించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జేఏసీ నాయకులు ఐ ఎన్ టి యు సి నాయకులు నరాల నరేష్ , పాల్వంచ కృష్ణ , సీఐటీయూ నాయకులు జిల్లా ఉపేందర్ , ధరావత్ రాందాస్ , బి.ఆర్.టి.యు నాయకులు షేక్ సత్తార్మియా , ఏఐటీయూసీ నాయకులు రావుల శ్రీను , టి యు సి ఐ నాయకులు శ్రీను , లక్ష్మీనారాయణ , టి ఎన్ టి యు సి నాయకులు రవీందర్ మరి కొంతమంది నాయకులు పాల్గొన్నారు .

# ఆధారాలు లేని, ఆరోపణలు చేయటం సరికాదు

- మాటతప్పని, మడమతిప్పని జగన్ మాయమాటలకి ప్రజలు లొంగిపోలేదు
- శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు.శంకర్



**శ్రీకాకుళం,కరపత్రం ప్రతినిధి జూన్ 17:**
మాటతప్పని, మడమతిప్పని జగన్ మోహన్ రెడ్డి మాయమాటలకి రాష్ట్ర ప్రజలు లొంగిపోలేదని, తమ ఓట్లతో సరైన సమాధానం చెప్పినా, ఆయన తీరు మారకపోవడం బాధాకరమని, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు.శంకర్ అన్నారు. స్థానిక విశాఖ కోలనీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లి సంతోషంగా ఉండేలా తల్లికి "వందనం" అమలు చేస్తున్న బావితర నేత నారా లోకేష్ బాబుకి ప్రత్యేక ధన్యవాదాలని, ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తుంటే, వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.2 వేలు లోకేష్ జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేయటం సరికాదని, ఆధారాలు లేని ఆరోపణలు చేయడమే వైసీపీ నేతల పనన్నారు. కనీసం తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్, నేడు తల్లికి వందనం గురించి మాట్లాడడం సిగ్గుచేటని, వైసీపీ పాలనలో రూ.13 వేలు ఇచ్చారంటే, రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా లేక తాడేపల్లి ప్యాలెస్ కు చేరాయ అని ఎద్దేవాచేశారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే, కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందని గుర్తుచేశారు. ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బాబు నిలబెట్టుకున్నారని, ప్రతి విద్యార్థికి తల్లికి వందనం వర్తింపు అవ్వాలని నారా లోకేష్ కృషి చేస్తుంటే, వైసిపి అసత్యప్రచారాలను చెయ్యటం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థుల తల్లుల ముఖాలు చిరునవ్వుతో వెలుగుతుంటే, వారి కళ్ళల్లో ఆనందం చూసి ఓర్వలేకే ఈ తప్పుడు వార్తలు ప్రచారం చేస్తుందన్నారు. పిల్లల స్కూలు ఫీజు కోసం అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం అండగా నిలుస్తుంటే, వైసిపి చేస్తున్న కూతలు, రాతలు హాస్యాస్పదంగా ఉన్నాయని, కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను జగన్ మోహన్ రెడ్డి మానసికంగా వేధింపులకు గురి చేసిన విషయం గుర్తుకురావటం లేదేమోనన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని, పాఠశాలలు తెరిచేలోగా పథకం అమలు చేశారని, 1వ తరగతిలోనూ, ఇంటర్ ఫస్ట్ ఇయర్ లోనూ చేరే విద్యార్థులకు కూడా ఈ పథకం అమలు చేసేలా చర్యలు తీసుకుంటుందన్నారు. తల్లి లేని పిల్లలకు... వారి తండ్రికి కానీ, లేదంటే సంరక్షుల ఖాతాలో కానీ డబ్బులు జమ చేస్తామని, అనాథలైన పిల్లలకు జిల్లా కలెక్టర్ నిర్ధారించిన తర్వాత పథకం వర్తింపచేస్తామన్నారు. ఒక బిడ్డ ఉన్నా... నలుగురు ఉన్నా... అందరికీ తల్లికి వందనం ఇస్తున్నామని, "కేజి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తాను.. ఎంతవరకు చదవుకుంటే అంతవరకు చదివిస్తాను.. మేనమామగా చెబుతున్నాను" అని మాయ మాటలు చెప్పి బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు చందిన 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసింది ఎవరని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విదంగా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అదికంగా ఖర్చు చేస్తుందని, ఒక వైపు అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. మోసపూరిత జగన్ తీరు మార్చుకోకుంటే, రానున్న ఎన్నికల్లో ఒక్క సీటు కూడా పొందలేరని, ఇప్పటికే బెంగళూర్ కు మకాం మార్చారని, ఇక అక్కడే పరిమితమవ్వాల్సి ఉంటుందన్నారు. అలాగే ఈ నెల 21న విశాఖపట్నంలో జరగనున్న భారీ స్థాయి యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లావాసులు, నియోజకవర్గ ప్రజలు, యోగా గురువులు, సాధకులు, పెద్ద సంఖ్యలో హాజరై, యోగాంధ్రాను విజయవంతం చెయ్యాలని, శ్రీకాకుళం నియోజకవర్గం నుండి 5 వేల మంది కార్యక్రమానికి బయలుదేరాలని గొండు.శంకర్ పిలుపునిచ్చారు.

## నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ మంత్రి సీతక్కను శాలువాతో సన్మానం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి
నిజామాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ను ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి తెలంగాణ సచివాలయంలో మంగళవారం నాడు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రిని శాలువాతో సన్మానించడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది అని వాటిని పరిష్కరించాలని కోరడంతో సానుకూలంగా స్పందించారని అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు , పాఠశాలలు పునర్నిర్మాణం చేయాలని అతి త్వరలో జిల్లా లో ఆర్మూర్ నియోజకవర్గంలో పర్యటనా చేయాలని మంత్రి సీతక్కను కోరినట్లు ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి తెలిపారు.

## పందిటి లక్ష్మీ ప్రసన్న లాస్యప్రియ ఆశీర్వదించిన వున్నం బ్రహ్మయ్య



**నేలకొండపల్లి,కరపత్రం ప్రతినిధి జూన్ 17:**
మండలం రాయిగూడెం గ్రామానికి చెందిన పందిటి ప్రభాకర్ గోవిందమ్మ కుమార్తెలు లక్ష్మీ ప్రసన్న లాస్యప్రియ నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవము కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించన నేలకొండపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వున్నం బ్రహ్మయ్య ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యమకారుడు మరికంటి రేణుబాబు, నంబూరి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ నాగయ్య, గణేష్, వెన్నబోయిన శీను, పతానపు నాగయ్య, కందాళ యూత్ అధ్యక్షుడు దాసరి ఉదయ్, టౌన్ నాయకులు లింగం ఎల్లమంద, సోషల్ మీడియా అధ్యక్షులు మాదాసు ఆదాం, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కుటుంబానికి టీడబ్ల్యూజేఎఫ్ నేతల పరామర్శ

- 35 వేలు ఆర్థిక సహాయం అందజేత



కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి
అనారోగ్యంతో ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్టు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ సభ్యుడు పెంటూకర్ శ్రీనివాస్ కుటుంబాన్ని సొసైటీ అధ్యక్షుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ లు మంగళవారం పరామర్శించారు. మల్కాజ్ గిరి లోని వారి ఇంటికి వెళ్లి శ్రీనివాస్ భార్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుటుంబాకి ఆర్థిక సహాయం కింద మామిడి సోమయ్యతో పాటు సొసైటీ ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, పలువురు సొసైటీ సభ్యులు చేసిన 35 వేల రూపాయలను మామిడి సోమయ్య.. దివంగత శ్రీనివాస్ భార్య అర్చన కు అందజేశారు. దాదాపు పాతికేళ్ళుగా వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పని చేసిన శ్రీనివాస్ ఆర్థికంగా ఏ మాత్రం ఎదగక పోగా..పైగా ఒక పత్రిక నడిపేందుకు పెట్టుబడి కోసం, కుటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం సొంతింటిని అమ్ముకోవడం బాధాకరమని మామిడి సోమయ్య అన్నారు. భార్య, ఉన్నత చదువులు చదువుకుంటున్న ఇద్దరు కూతుళ్ళతో కలిసి పదహారేండ్లుగా కిరాయి ఇంట్లో ఉంటున్నారని తెలిపారు. జర్నలిజం వృత్తిని నమ్ముకుని ఏళ్ళతరబడి జర్నలిస్టుగా పనిచేస్తున్న శ్రీనివాస్ లాంటి అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేక ఆర్థికంగా అత్యంత ధీనస్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు ప్రభుత్వం గానీ, అటు యాజమాన్యాలు గానీ జర్నలిస్టుల సంక్షేమ పట్ల ఎంత మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదని అన్నారు. చనిపోయిన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్ల నుంచి ఇస్తున్న లక్ష రూపాయల సహాయమే నేటికీ ఇస్తున్నారని, ఈ సహాయాన్ని కనీసం 10 లక్షలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు జారీ చేసి ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

## పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్ట రాగమయి....



కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి
మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న.... సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే మరియు మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కూన శ్రీశైలం గౌడ్ పుట్టినరోజు వేడుక కార్యక్రమం లో పాల్గోని వారికీ శుభాకాంక్షలు తెలియజేసిన ...రాగమయి దయానంద్..

# ప్రజల ప్రాణాలను కాపాడండి

- టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోశపతి.



**సూర్యాపేట జిల్లా కరపత్రం ప్రతినిధి జూన్ 17**
ప్రపంచ ప్రజల గుండెల పై మెరుపుదాడులను మానవ ప్రణాలను కాపాడే నాధుడే లేరా ఐక్యరాజ్యసమితి మొద్దు నిద్రపోతుందా ప్రజల ప్రాణాలు అంటే ఇంత చిన్నచూపా అని టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హుజూర్ నగర్ పట్టణంలో కార్మికులతో యుద్ధానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ రోషపతి మాట్లాడుతూ రష్యా ఉక్రేనియన్ ఒకపక్క ఇజ్రాయిల్ హమాస్ అంతు చిక్కని యుద్ధ సమయంలో ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధ జ్వాలాలు ప్రపంచశాంతి మరింత దహించి వేస్తున్నాయని వీటిపై ఐక్యరాజ్యసమితి స్పందించకపోవడం దౌర్భాగ్యమైన విషయమని ఇజ్రాయిల్ ఇరాన్ పై అణు కేంద్రాల అణు క్షిపని సైనిక కార్యాలయాలను పెద్ద ఎత్తున దాడులు చేస్తూనిప్పులుచిమ్ముతున్నారని వందలాది మంది ప్రాణాలు పోతున్నాయని వేలాది ఇండ్లు కూలిపోతున్నాయని దిక్కుతోచని పరిస్థితులలో ప్రజలు ఆందోళన చెందుతున్నరని,ఇంకోపక్క ఈ కష్టకాలంలో రష్యా చైనా ఇరాన్ వెంటనే వచ్చే అవకాశం ఉంది ఇజ్రాయిల్ వెనక అమెరికా పాత్ర ఇదే జరిగితే విశ్వశాంతి దీపం పూర్తిగా కోడగడుతుందని విశ్వశాంతి పరిస్థితి విషమించక ముందే అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకోవాలని ఉద్రిక్తలను తగ్గించే మార్గాల్లో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సమాజం దౌత్య మార్గంలో పూనుకోని అమాయక ప్రజల ప్రాణాలను కాపాడాలని రోషపతి కోరారు.ఈ కార్యక్రమం లో టిఎన్టిసి నాయకులు వెంకన్న శీను జానీ తిలక్ చంద్రగిరి సాంబ మరి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అమ్మ మాట - అంగన్ వాడి బాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్...

**దేవరకద్ర,కరపత్రం ప్రతినిధి జూన్ 17:**
నియోజకవర్గం లోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని దండు గడ్డ కాలనీలోని అంగన్వాడి వద్ద రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు, పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన అమ్మ మాట- అంగన్‌వాడీ



బాట,కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ప్రోటీన్ తో కూడిన పౌష్టికాహారం అందించేందుకు వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ ఇచ్చే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు, ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, పిల్లలతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే జియంఆర్...

# మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు

**మహబూబ్ నగర్,కరపత్రం ప్రతినిధిజూన్ 17:**
రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా వాకిటి శ్రీహరి ముదిరాజ్ పదవీ బాధ్యతలు చేపట్టి నేడు మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా ఘన స్వాగతం పలికిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి , మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్,జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు.అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ఏర్పడడం, సహచర ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ కి మంత్రి పదవి రావడం సంతోషకరమని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ... నాకు మంత్రి పదవి రావాలని ముక్తా కంఠంతో మద్దతు తెలిపిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలందరికీ, అవకాశం కల్పించిన ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి కి, కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేశారు.

